## నంది వాహనంపై శివపార్వతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, మార్చి 1 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీనాగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ముగింపులో భాగంగా రాత్రి నంది వాహనంపై శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను కూర్చుండబెట్టి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం గ్రామోత్సవానికి హాజరై లాంఛనంగా ప్రారంభించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీకి చెందిన ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్, చెన్నం శ్రీనివాసులు, ఎజి కిషోర్, కె.అనిల్‌కుమార్‌రెడ్డి, తాటిపర్తి ఆదినారాయణ, కె.శ్రీధర్, పామూరు మునుస్వామి, దాము, సాయి, చంద్రమోహన్, కొండలరావు, పర్వతరెడ్డి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## కమనీయంగా మొగిలీశ్వరుడి కళ్యాణోత్సవం

బంగారుపాళ్యం, మార్చి 1 ప్రభాతవార్త:



శనివారం రాత్రి మొగిలీశ్వరుని కళ్యాణోత్సవం వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కళ్యాణ వేదికను పచ్చని తోరణాలు, వివిధ పుష్పాలతో ఆలకరించారు. నూతన వధూ వరులైన స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను కళ్యాణ వేదికపై వుంచి శాస్త్రీయంగా కళ్యాణోత్సవం చేపట్టారు. ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల కళ్యాణంను మాంగళ్యధారణతో గావించారు. ఉభయదారులుగా చిత్తూరుకు చెందిన న్యాయవాది లోకనాథరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఉదయం భృంగి వాహనంపై మొగిలీశ్వరుడు ఆలయ పురవీధుల్లో ఊరేగారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా పాటూరు హిమబిందు, యశ్వంత్‌కుమార్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఇంటర్మీడియట్

## మొదటి సంవత్సరం పరీక్షలు..

### పరీక్షలకు 32,344 మంది విద్యార్థులు హాజరు: ఆర్.ఐ.ఓ

తిరుపతి విద్య మార్చి 1 ప్రభాత వార్త





జిల్లాలో నేడు జరుగుతున్న ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయని,శనివారం రోజు జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 32,344 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ జీవి.ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 జనరల్,15 వొకేషనల్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లాంగ్వేజ్ పేపర్1 పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జనరల్ 31,851 మంది,ఒకేషనల్లో 1,313 మంది మొత్తం 33,164 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 720, ఒకేషనల్లో 100 మంది,మొత్తం 820 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు.పరీక్షా కేంద్రాలలో త్రాగు నీటి వసతి,పోలీసు బందోబస్తు,మెడికల్ క్యాంపు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పర్యవేక్షణ,విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా బస్సుల సౌకర్యం కల్పించామని ఆర్ఐఓ తెలిపారు.

## లారీ ఢీకొని తల్లి..కుమారుడి మృతి

### మరో కుమారుడికి తీవ్రగాయాలు



మృతి చెందిన తల్లికుమారులు శ్యామలమ్మ, రవితేజ

శాంతిపురం, మార్చి 1 ప్రభాతవార్త

కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో శనివారం ఓ లారీ ద్విచక్రవాహనంను ఢీకొన్న సంఘటనలో తల్లి,కుమారుడు మృతి చెందారు. మరో కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. బైరెడ్డిపల్లి మండలం మూగనపల్లికి చెందిన శ్యామలమ్మ (45), ఆమెకుమారులు రవితేజ (20), పవన్‌కుమార్ (28)లు ద్విచక్రవాహనంలో మండలంలోని సోగడబళ్ల గ్రామానికి టువీలర్‌లో వస్తుండగా కుప్పం నుంచి వి.కోట వైపు వెళ్తున్న లారీ టువీలర్‌ను ఢీకొందన్నారు. దీంతో శ్యామలమ్మ, రవితేజలు అక్కడికక్కడే మృతి చెందగా మరో కుమారుడు పవన్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా అతన్ని చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. కాగా లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని స్థానికులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అతను లారీ ఆపకుండా వెళ్లడంతో స్థానికులు అతన్ని ద్విచక్రవాహనాల్లో వెంబడించి లారీని ఆపేశారు. గుడుపల్లె ఎస్సై శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పుట్టినరోజే శవమయ్యాడు

తడ, మార్చి 1 ప్రభాతవార్త



మాంబట్టు సెజ్ మార్గంలో మృతిచెందిన యువకుడు

తడ మండలం మాంబట్టు సెజ్‌లోని ఒక పరిశ్రమ వద్ద నీళ్ల గుంటలో దిగి దిలీప్‌కుమార్ యాదవ్ (32) అనే యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు, చెన్నైకి చెందిన ఒక కంపెనీ ద్వారా సెజ్‌లోని ఒక పరిశ్రమకు సరుకులు లోడ్ చేసుకునేందుకు వచ్చిన నాగాల్యాండ్‌కు చెందిన దిలీప్‌కుమార్ యాదవ్ లారీని రోడ్డు పక్కన ఉంచి ఆ సమీపంలో ఉన్న నీటి గుంటలో స్నానం చేసేందుకు దిగి లోతు తెలియక ఊపిరాడక మృతిచెందినట్లు చెప్తున్నారు. దిలీప్‌కుమార్ యాదవ్ వివరాలు తెలుసుకున్న తర్వాత అతని పుట్టిన రోజు మార్చి 1, 1993గా ఉంది. ఆధార్‌కార్డు, ఇతర వివరాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ కొండప్పనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిడినెల్లూరులో 2 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు

### - గత ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి తీరని అన్యాయం - నిరుపేదలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు

### - పేదరికం నిర్మూలించడానికి ఉగాది నుండి పి4 విధానం అమలు - పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త:

గత ఐదేళ్ళ వైకాపా ప్రభుత్వ పాలనలో ప్రతి ఒక్కరికి తీరని అన్యాయం జరిగిందని, ఆ పాలకులు రాష్ట్రంను ఆర్థికంగా విధ్వంసం చేసి కోలుకోలేని స్థితికి తీసుకెళ్ళారని మాజీ సిఎం, రాష్ట్ర వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిప్పులు చెరిగారు. సామాజిక పెన్షన్ల పంపిణీ చేయడానికి శుక్రవారం గంగాధరనెల్లూరు వచ్చిన సిఎం నారా చంద్రబాబునాయుడు పెన్షన్ల పంపిణీ అనంతరం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైకాపా ప్రభుత్వం జిల్లాను ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఎద్దేవా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జిడినెల్లూరులో 2 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనుందన్నారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు అయితే జిడినెల్లూరు నియోజకవర్గంతో పాటు చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గత ఐదేళ్ళలో రాష్ట్రంను వైకాపా పాలకులు పందికొక్కుల్లా దోచుకున్నారని, ప్రజలపై 10 లక్షల కోట్ల రూపాయల అప్పుల బారం మోపి వెళ్ళారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన తనకే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి దిమ్మతిరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ 9 నెలల కాలంలో ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం గత వైకాపా ప్రభుత్వం చేసిన 24 వేల కోట్ల రూపాయల అప్పులను తీర్చిందన్నారు. పేదరికం లేని సమాజం ఆవిష్కరించడానికి కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమ పాళ్ళల్లో చేపట్టి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నడుం బిగించిందన్నారు. రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లోనే 6.50 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయని, 5 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరుగని విధంగా రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీ రికార్డు స్థాయిలో జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా 64 లక్షల మంది పెన్షన్ లబ్దిదారులకు ఏడాదికి 33 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా మన్నారు. బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా ముందుంచడానికి 3 లక్షల కోట్లతో బడ్జెట్ తీసుకువచ్చామన్నారు. అలాగే ఈ ఏడాది జూన్ నాటికి డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. పేదరికం లేని సమాజం ఆవిష్కరణకు ఉగాది నుండి పి4 విధానం అమలు శ్రీకారం చుట్టనున్నామన్నారు. పేదరికంను పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో ప్రజల నుండి అభిప్రాయాలు, ఆలోచనలు తీసుకుని పి4 విధానం అమలు చేయనున్నామన్నారు. ఆర్థిక వనరులు పుష్కలంగా వున్న 10 శాతం మంది ఆర్థిక వనరులు ఏ మాత్రం లేని 20 శాతం మందికి చేయూత ఇవ్వడం ద్వారా నిరుపేదలకు ఆర్థికంగా బలోపేతం చేయవచ్చునన్నారు. గత ఐదేళ్ళ పాలనలో వైకాపా ప్రభుత్వం ఏ ఒక్క చిన్న గ్రామంలో ఒక్క సిమెంటు రోడ్డు వేసిన దాఖలాలు లేవన్నారు. ఈ 9 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం 20 వేల కిమీ రోడ్డు మరమ్మత్తులు చేసి గుంతలు పూడ్చి ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందిస్తోందన్నారు. సౌరశక్తితో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి సోలార్ ఎనర్జీ సిస్టంకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రజలు తమ ఇళ్ళపై సౌర విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుంటే ప్రతి నెల ప్రతి ఇల్లు 200 యూనిట్ల మేరకు



ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చునన్నారు. ఇప్పటికే రాష్ట్ర రాజధాని అమరావతి పనులు ప్రారంభం అయ్యాయని, అలాగే పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే ఈ ఏడాది మే నెలలో తల్లికి వందనం పథక కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు పాఠశాలకు వెళ్తున్నారో అంత మంది పిల్లలకు 15 వేల రూపాయలు వారి బ్యాంకు ఖాతాల్లో వేయడం జరుగుతుందన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన ప్రతి రైతులకు ఏడాదికి 20 వేల రూపాయలు పెట్టుబడి సహాయం అందించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు భారంగా మారాయని, దీని కోసం పేద, మధ్య తరగతి ప్రజలకు 2.50 లక్షల రూపాయల వైద్య బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అలాగే నిరుపేదలకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 25 లక్షల రూపాయల వరకు వైద్య సహాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఇల్లు, మంచినీటి కుళాయి, మరుగుదొడ్డి, కరెంటు, దీపం గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో మామిడి ఆధార పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే విఎం థామస్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి బాజ్‌పేయ్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడ పిడి వికాస్ మర్మత్, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీఎమ్మెల్యే ఆర్.గాంధీ, చుడాఛైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

### 700 మంది నిరుద్యోగ యువతకు

## ఉద్యోగాల కల్పనకు చర్యలు

### - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్

### - వన్ఎంవన్‌బి స్కిల్ సెంటర్‌చే ఉచిత శిక్షణ తరగతులు !!



కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో వన్ఎంవన్‌బి గ్రీన్‌స్కిల్స్ రెడినెస్ సెంటర్ ద్వారా తొలివిడతగా 700మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. జిల్లాలో ఉంటూ టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ కోర్సులు పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న వారికి వన్ఎంవన్‌బి సంస్థ ద్వారా కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఈనెల 3,4 తేదీల్లో ఉచితంగా ప్రీ ప్లేస్‌మెంట్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు హాజరయ్యే యువతకు సాఫ్ట్‌స్కిల్స్, ప్రొఫెషనల్ గ్రూమింగ్, మాక్ ఇంటర్వ్యూ, రెస్యూమ్ తయారీ తదితర అంశాల్లో శిక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. ఈశిక్షణ తరగతులకు హాజరైన వారు ఈనెల 11న నిర్వహించే మినీ జాబ్‌మేళాకు హాజరుకావచ్చున్నారు. ఇంతవరకు రిజిస్ట్రేషన్లు చేసుకోని టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ కోర్సులు చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వృద్ధులకు ఆసరాగా

## సామాజిక భద్రత పెన్షన్లు

### -జిల్లాలో 2,62,461మంది లబ్దిదారులకు రూ.112.06 కోట్లు

### -వేదాంతపురంలో లబ్దిదారులకు పెన్సన్స్ పంపిణి చేసిన కలెక్టర్

తిరుపతిరూరల్, మార్చి01 ప్రభాతవార్త:



ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్సన్స్ వృద్దులకు, వికలాంగులకు, వితంతువుల జీవనానికి పెన్సన్స్‌ను ఎంతో ఆసరా ఇస్తున్నాయని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం తిరుపతిరూరల్ వేదాంతపురంలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్సన్స్ లబ్దిదారులకు కలెక్టర్ అందజేసారు. నెలవారీ పెన్సన్స్ సక్రమంగా అందుతున్నాయా! సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పెన్సన్ పంఫిణి చేస్తున్నారా! లేదా తదితర విషయాలను లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పెద్దఎత్తున పెంచిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్సన్స్‌ను అర్హులైన లబ్దిదారులకు ఉదయాన్నే సచివాలయ సిబ్బందిచే పంఫిణి చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో మార్చి నెలకు సంబంధించిన 2,62,461 మందికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్సన్స్ సుమారు రూ.112.06 కోట్ల రుపాయాలు పంఫిణి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ ఇవ్వనంతరగా ఆంధ్ర రాష్ట్రంలో పెన్సన్స్ పెంచి పంఫిణి చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్లు క్రమం తప్పకుండా ఇంటి వద్దనే అందిస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్న పలువురు లబ్దిదారులు సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్డిఎ పిడి వెలుగు ప్రభావతి, డిఎల్‌డిఓ నారాయణరెడ్డి, తిరుపతిరూరల్ ఎంపిడిఎ రామచంద్ర, పంచాయతీ కార్యధర్శి మునీశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు వరం భూ క్రమబద్ధీకరణ పథకం

కోట, మార్చి 1 ప్రభాతవార్త

ఎలాంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ కోసం పథకాన్ని జనవరి 29న కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిపై జీఓ నంబర్ 30 జారీ చేసింది. ఈ పథకం ద్వారా మధ్యతరగతి కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. జిల్లా వ్యాప్తంగా క్రమబద్ధీకరణ చేయాల్సిన ఇళ్ల వేల సంఖ్యలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి పట్టాల కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలకు ఇది సువర్ణ అవకాశమే. క్రమబద్ధీకరణ పథకం 2019 అక్టోబర్ 15కు ముందు జరిగిన ఆక్రమణలకు సంబంధించి మాత్రమే వర్తిస్తుంది. ఆక్రమిత ప్రభుత్వ స్థలంలో పక్కాగృహాలు నిర్మించుకుంటే ఈ పథకంలో భాగంగా 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. 150 గజాలకు పైన ఉంటే నిర్ణీత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పట్టా మహిళల పేరున మంజూరు చేస్తారు. ఖాళీ స్థలం, గడ్డితో ఏర్పాటు చేసుకున్న గుడిసెలకు ఈ పథకం వర్తించదు. ఇప్పటివరకు ప్రభుత్వ స్థలం, పక్కాఇళ్లు తీసుకొని ఉండకూడదు. ఏడాదికి ఆదాయం గరిష్టంగా రూ.1.20 లక్షలకు లోపు మాత్రమే ఉండాలి. వ్యవసాయ 10 ఎకరాలు లేదా 3 ఎకరాలు తడి భూమి కంటే ఎక్కువ ఉంటే ఈ పథకానికి అనర్హులు. ఆదాయం పన్ను చెల్లించినా, నెలకు నెలవారీ 300 యూనిట్లు కంటే ఎక్కువ విద్యుత్ వాడితే ఈ పథకానికి అనర్హులు. లబ్ధిదారులు పట్టా కన్వేన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కు జారీ చేస్తారు.

# కమనీయం గౌరీ శంకరుల కళ్యాణం



శ్రీకాళహస్తి, (ప్రభాతవార్త)

శ్రీకాళహస్తిలో వెలసిన గౌరీ శంకరుల కళ్యాణోత్సవం సంప్రదాయ బద్ధంగా శనివారం వేకువజామున జరిగింది. వేలాది మంది భక్త జనులు విఐపిలు వీక్షిస్తుండగా దేవదేవుని కళ్యాణం కన్నుల పండువగా సాగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాధానార్చకుల మంత్రాలతో భోళాశంకరుని మాంగల్యధారణ శాస్త్రోక్తంగా భావి తరాలకు హిందూ సంప్రదాయంలో వివాహానికి గల ప్రాధాన్యతను తెలియజేస్తూ కార్యక్రమాలను నిర్వహించారు. కైలాసనాధుని కళ్యాణోత్సవం అంటే శ్రీకాళహస్తి చుట్టుపక్కల జనానికి ఎంతో సంబరం. తమ ఇంటిలో వివాహ సంబరం ఉన్నట్లు భావిస్తారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి తండోపతండాలుగా భక్త జనం కళ్యాణోత్సవం రాత్రి కదలి వచ్చారు. దాంతో పట్టణంలో ఎటు చూసినా భక్తజనుల సందడికనబడింది. ఈ నేపధ్యంలో బాల్య వివాహాల పీట ముడి స్వామిఅమ్మవార్ల కళ్యాణానికి వచ్చే జనం తగ్గారు. అయినా స్వామి అమ్మవార్ల కళ్యాణం చూడటానికి భక్తులు సంబరపడుతుంటారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరుడుగా వెలసిన కైలాసనాధుని వధువుగా ముస్తాబు చేసారు. దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని వధువుగా శోభాయమానంగా ముస్తాబు చేసారు.

### మూడున్నర గంటలకు మాంగల్యధారణః

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి కళ్యాణంలో మాంగల్యధారణ ఘడియలు వేకువజాము ఖరారుచేసారు.ఈ మేరకు శాస్త్రోక్తంగా వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఆలయప్రధానార్చకులు వరదా గురుకుల్ అమ్మవారి పల్లకిపై డాక్టర్ స్వామి నాధన్ గురుకుల్ స్వామి పల్లకిపై ఉంటూ స్వామి వారు అందించిన మాంగల్యాన్ని అమ్మవారి మెడలో ధరింపజేసే కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఉభయదారులు కైకాల వారి సంఘం, తమిళనాడులోని తిరవళ్ళూరు జిల్లాలోని కొళవెళత్తూరుకు చెందిన సెంగుందర్ సంఘానికి చెందిన వారు, శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దంపతులు,మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్ దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరాజు సేవా కమిటి నాయకుడు మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు బిజెపికి చెందిననాయకులు అమర్‌నాథ్,మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, డిల్లిబాబు ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్‌రెడ్డి, ఇఇ మురళీధర్ రెడ్డి, ఎఇఇ కిషోర్ ఇన్సె పెక్టర్ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్సె పెక్టర్స్ హరియాదవ్, సుదర్శనం పాల్గొన్నారు. కళ్యాణోత్సవంవైభంగా సాగింది.స్వామి అమ్మవార్ల కళ్యాణానికి విజయసారధి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డివైఎస్‌పి నరసింహామూర్తి, సిఐలు గోపి, తిమ్మప్ప, వెంకటేశ్వర్లు,రవినాయక్ వారి సిబ్బంది బందోబస్తుతో పాటు బాల్యవివాహాల నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

## కన్నుల పండువగా సభాపతి కళ్యాణం.

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిసున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సందర్భంగా మంగళవారం రాత్రి అలయంలో 16కాళ్ళ మండపంలో సభాపతి కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. శనివారం రాత్రి పార్వతీపరమేశ్వరుల కళ్యాణానికి మధ్యవర్తిగా వ్యవహరించిన సభాపతి కళ్యాణాన్ని అంగరంగా వైభవంగా ఏర్పాటు చేశారు.అలయంలోని అలంకార మండపం నుంచి నటరాజస్వామి ఉత్సవ విగ్రహాన్ని శివకామసుందరి ఉత్సవ విగ్రహాన్ని అలయంలో ప్రదక్షణగా 16 కాళ్ళ మండపంలోకి మేళతాళాలు, మంగళవాయిద్యాలతో తీసుకెళ్ళారు. అక్కడ బాడాక్టర్ స్వామినాధన్ గురుకుల్ సారథ్యంలో ఆలయ పౌరోహితులు అర్ధగిరి వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శాస్రోక్తంగా పూజలు జరిపారు. హోమాలు ఏర్పాటు చేసి మామిడి తోరణాలు,అరటిచెట్లతో ముస్తాబు చేశారు.భక్తుల సమక్ష లో కళ్యాణోత్సవం కనుల పండుగవగా నిర్వహించారు.ఈసందర్భంగా కళ్యాణోత్సవ వేదిక వద్ద హోమాలు నిర్వహించారు.స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు.అనంతర సభాపతిచే అమ్మవారికి మాంగల్యధారణ కార్యక్రమాలను డాక్టర్ స్వామినాధన్‌గురుకుల్ నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లను చక్కగా అలంకరించి పురవీధులల్లో ఊరేగించారు.ఈ కార్యక్రమాల్లో ఆలయాధికారులు సిబ్బంది పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

## నేడు కుప్పంలో చికెన్ మేళా

**కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త** ఎపి పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు కుప్పం తెదేపా కార్యాలయ సమీపంలో పౌల్ట్రీ పరిశ్రమలపై అవగాహన మరియు చికెన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా హాజరయ్యే వారికి ఉచితంగా చికెన్ కబాబ్ మరియు కోడిగ్రుడ్లను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

## హోటళ్లలో మున్సిపల్ కమీషనర్ ఆకస్మిక తనిఖీలు



**కుప్పం, మార్చి 1ప్రభాతవార్త** కుప్పం పట్టణంలోని పలు హోటళ్లలో శనివారం ఉదయం ఆరు గంటలనుంచే మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆహార పదార్థాలను ఈసందర్భంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇడ్లీ, ఇతర ఆహార పదార్థాలు తయారు చేసే సమయంలో, ప్రజలకు వాటిని అందించే క్రమంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాలు వండేందుకు కాటన్ గుడ్డలను వినియోగించాలన్నారు. ప్రజలకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత ఉండడంతో పాటు ధరలు కూడా నిర్ణీతంగానే ఉండాలని ఆదేశించారు. ధరలు పెంచడం, నాణ్యత లేని ఆహారం అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చందం హరిజనవాడకు నూతనంగా సిసి రోడ్డు



**కుప్పంరూరల్, మార్చి 1 ప్రభాతవార్త** మండలంలోని చందం పంచాయతీ హరిజన వాడకు నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, స్థానిక మహిళలు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో హరిజనవాడకు నూతనంగా రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సిఎం నేతృత్వంలో అన్ని దళిత వాడలను అభివృద్ధి చేసి వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో దామోదరనాయుడు, సుబ్బు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛనులన పంపిణీ



**కల్లూరు, మార్చి 1, ప్రభాతవార్త** అవ్వ నమస్కారం.. తాతా నమస్కారం.. అమ్మా నమస్కారం.. అంటూ గ్రామ సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. మార్చి నెల నుంచి ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో మార్పులు చేసింది గ్రామ సచివాలయ సిబ్బంది తొలుత లబ్ధిదారులకు నమస్కారం చేసి సీఎం చంద్రబాబు నాయుడు మెసేజ్‌ని వినిపించి పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామ సచివాలయ సిబ్బంది నిబంధనలను పాటించి పింఛలను అందజేశారు. పులిచెర్ల మండలంలో 6768 పింఛన్ల కోసం ప్రభుత్వం రూ. 2..73 కోట్లు విడుదల చేసింది ఆదివారం 98శాతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలకు సన్మానం



**యర్రావారిపాలెం, మార్చి 1, ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని చంద్రగిరి నియోజకర్గం యర్రావారిపాలెం మండలం యువత ఘనంగా సన్మానించారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్ రెడ్డిలకు సత్కరించిన 40 మంది యల్లమంద యువకులు చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచనల మేరకు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమితులైన చెవిరెడ్డి హరిత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. తుమ్మలగుంటకు చేరుకుని నూతన అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డితో పాటు నియోజకవర్గం పార్టీ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన విభాగం నేతలు ఓబుల్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెంగల్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి, భాను వర్ధన్ నాయుడు, రెడ్డి ప్రసాద్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, వినోద్ నాయుడు, జుబేర్, వీరనాగేంద్ర, తేజేశ్వర్ రెడ్డి, వెంకటరమణ, ప్రవీణ్ కుమార్, లతీష్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

**చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో శనివారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులను ఘనంగా సన్మానించారు.

## బాబు పాలన అబద్దాలకు చిరునామా

**బంగారుపాళ్యం, మార్చి 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలను అబద్దాల్లో ముంచి పరిపాలన సాగించడంలో దిట్ట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితకుమారిలు ఆరోపించారు. శనివారం సాయంత్రం పాలేరులో వైఎస్ఆర్‌సిపి మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశం మండల కన్వీనర్ రామచంద్రరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితకుమారిలు మాట్లాడుతూ అధికారం కోసం సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం మభ్య పెట్టిందన్నారు. ఇటీవల ప్రకటించిన రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాల అమలు అవశ్యకతను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, వైకాపా నాయకులు ప్రకాష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, పాలాక్షిరెడ్డి, అన్ను, గజేంద్ర, జగదీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జాస్మిన్‌కు ఘన సన్మానం



**బంగారుపాళ్యం, మార్చి 1 ప్రభాతవార్త:** బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన జాస్మిన్‌కు ముస్లీం ఐక్య వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 9వ తరగతి చదువుతున్న జాస్మిన్ రాష్ట్ర స్థాయి బాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొని విజయం సాధించింది. ఇందుకు గాను ముస్లీం ఐక్య వేదిక శనివారం బంగారుపాళ్యంలో జాస్మిన్‌ను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లీం ఐక్యవేదిక అధ్యక్షులు ఫిరోజ్ అహ్మద్, రాష్ట్ర అధికార ప్రతినిధి షౌకత్, రాష్ట్ర సమన్వయకర్త రషీద్, పూతలపట్టు నియోజకవర్గ అధ్యక్షులు ఖాజా, గౌరవ అధ్యక్షులు రహీం తదితరులు పాల్గొన్నారు. అలగే జాస్మిన్‌కు ప్రోత్సాహం కింద 10 వేల రూపాయల నగదును అందజేశారు.

## సమగ్ర పశుపోషణతో వ్యాధులకు దూరం : పవన్‌కుమార్



**చౌడేపల్లి, మార్చి 1 ప్రభాతవార్త** సమగ్ర పశుపోషణతో వ్యాధులకు దూరంగా వుంచవచ్చునని మండల పశువైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలలోని పాడిపశువులు, గేదెలకు గాలికుంటు నిర్మూలనా టీకాలు వేసారు. అదే విధంగా 4నుంచి 8నెలల మద్యగల లేగదూడల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసారు. మండలానికి 15వేల డోసులు గాలికుంటు, 950డోసులు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో వుంటాయన్నారు. ఈనెల 1నుంచి 30వరకు ఆయా పశువైద్య కేంద్రాల పరిధిలో వేస్తున్నామనీ, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కొలమాసనపల్లె టిడిపి ఎంపిటిసి రాజీనామా



**పలమనేరు, మార్చి 1, ప్రభాతవార్త:** పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె 2 టిడిపి ఎంపిటిసి లక్ష్మీనారాయణ శనివారం ఎంపిటిసి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు పలమనేరు మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఓ ఖధర్ బాషా కు ఆయన రాజీనామా పత్రాన్ని అందజేశారు. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో వైకాపాకు పంచాయితీలో గట్టి పోటీ ఇచ్చి వైకాపా అభ్యర్థిపై గెలుపొందిన లక్ష్మీనారాయణ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో ఎం.పి.టి.సి పదవికి రాజీనామా చేయడంపై అటు కూటమి పార్టీలోను ఇటు వైకాపాలోను చర్చకుతావునిస్తుంది. ఇప్పటికే మండల స్థాయి నాయకులకు ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులు గుర్తింపు, ప్రాధాన్యత ఇవ్వడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో అధికార పార్టీ ఎంపిటిసి రాజీనామా చేయడంతో మండలంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

## పట్టణంలో 97 శాతం పూర్తైన పెన్షన్ల పంపిణీ

**పలమనేరు, మార్చి 1, ప్రభాతవార్త:** పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఒక్కరోజులో 97.05 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశామని మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు పట్టణంలో 4549 మంది పెన్షనర్లు ఉండగా ఒక్కరోజులో 4415 మందికి పెన్షన్లను పంపిణీ చేశామని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి వార్డు సచివాలయ సిబ్బంది ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పెన్షన్లను పంపిణీ చేపట్టారని తెలిపారు.

## గణనాధుని సేవలో మైదుకూరు ఎమ్మెల్యే



**కాణిపాకం, మార్చి 1 ప్రభాతవార్త:** కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శనివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## అధికార నందివాహనంపై విహరించిన కాళభైరవుడు



**తవణంపల్లె, మార్చి 1 ప్రభాతవార్త:** మండల కేంద్రం తవణంపల్లెలో ఎతైన కొండపై వెలసిన శ్రీకాళభైరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వేడుకలలో భాగంగా శనివారం కాళభైరవస్వామి అధికార నందివాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయంలో ఈనెల 24 నుండి మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతున్న విషయం విధితమే. ఇందులో భాగంగా శనివారం స్వామివారికి రావణబ్రహ్మ వాహనసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి తవణంపల్లెకు చెందిన మొదలియార్ కులస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు ఉదయం ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం రాత్రి అలంకార భూషితులైన స్వామివారిని అధికార నందివాహనంపై వుంచి వివిధ రకాల వాయిద్యాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనల నడుమ గ్రామపురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అపోలోచే మినరల్ వాటర్‌ప్లాంట్‌ల ప్రారంభం



**తవణంపల్లె, మార్చి 1 ప్రభాతవార్త:** అపోలో హాస్పిటల్ సామాజిక సేవా విభాగం సంపూర్ణ ఆరోగ్యపథకం ఆధ ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లను శనివారం ప్రారంభించారు. అపోలో గ్రూఫ్ ఆఫ్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి ఏరా ్టటు చేసిన అక్షయధార పథకంలో భాగంగా సీఎస్ఆర్ అపోలో ఆస్పత్రుల గ్రూపు వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని సహకారంతో మండలంలోని గళ్ళావాళ్ళవూరు, ఎగువ వెంకటాపురం గ్రామాలలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సుమారు 25 లక్షల రూపాయల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ఈప్లాంట్‌లను అపోలో ఆస్పత్రుల మెటిరియల్ ప్రెసిడెంట్ జి.నరోత్తమరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి, ఉపాసన కామినేని వారి సహకారంతో ఇప్పటి వరకు 20 గ్రామాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన గ్రామాలలో కూడా నిర్మించడానికి సిద్దంగా వున్నామ్మన్నారు. కార్యక్రమంలో సంపూర్ణ ఆరోగ్యపథకం సీఈఓ రాంబాబు, అపోలో పార్మసి డీజీఎం సత్యారెడ్డి, అపోలో పీఆర్ఓ కమృద్దీన్, వైకాపా నాయకులు గాంధీబాబు, తడకర మధుకుమార్, జొన్నగురకల రాజశేఖర్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, ఇంద్రాణి, గంగయ్య, భూపతినాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మొదలైన ఇంటర్ పరీక్షలు

**కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త**

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా మొదలయ్యాయి. కుప్పంలోని ఎంఎఫ్‌సి జూనియర్, వృత్తివిద్య కాలేజ్‌లు, వికాస్ పబ్లిక్ స్కూల్, కుప్పం జూనియర్ కాలేజ్ తదితర చోట్ల పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఉదయం 8గంటలనుంచే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తొలిరోజు తెలుగు పరీక్ష ఉదయ ం 9గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించారు. పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. అర్బన్ సిఐ శంకరయ్య పట్టణంలోని పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును నేరుగా పర్యవేక్షించారు.

## నేటినుంచే రమజాన్ ఉపవాస దీక్షలు

**కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త**

ముస్లిం సోదరుల పవిత్ర రమజాన్ మాసం వచ్చేసింది. శనివారం సాయంత్రం నెలవంక దర్శనం ఇవ్వడంతో నియోజకవర్గంలోని మసీదుల్లో తరావీహ నమాజులను మత గురువులు ప్రారంభించారు. ఆదివారం వేకువ జామున సహరీతో రమజాన్ ఉపవాస దీక్షలు మొదలుకానున్నాయి. సహరీ చేసేందుకు పట్టణంలోని పలు మసీదుల్లో దాతల సాయంతో ఆహార ఏర్పాట్లను చేపట్టారు. నెలరోజుల పాటు ముస్లిం సోదరులు రమజాన్ ఉపవాస దీక్షలను నియమ నిష్టలతో చేపడతారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుప్పం టౌన్‌బ్యాంక్‌పై రిజర్వ్‌బ్యాంక్ ఆంక్షల తొలగింపు

*– గృహ..బంగారు.. తాకట్టు రుణాలకు లైన్ క్లియర్ !!*



**కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త** కుప్పం పట్టణంలోని సహకార టౌన్‌బ్యాంక్‌పై రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)విధించిన ఆంక్షలు తొలగిస్తూ ఫిబ్రవరి 28న ఉత్తర్వులు జారీ చేసిందని పిఏసి ఛైర్మన్ బ్రహ్మానందరెడ్డి, మేనేజర్ పి.శివకృష్ణ తెలిపారు. 1924లో స్థాపించిన టౌన్‌బ్యాంక్ వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. అయితే 2014నుంచి రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కొన్ని ఆంక్షలను టౌన్‌బ్యాంక్‌పై విధించిందన్నారు. తద్వారా బ్యాంకుపరిధిలో రుణాలు ఇవ్వకపోవడం, షేర్‌హోల్డర్లకు డివిడెంట్ ఇవ్వకపోవడం వంటివి చోటుచేసుకున్నాయన్నారు. 2020సం॥లో బ్యాంకులో జరిగిన పలు అవకవతలతో బ్యాంకు నష్టాల బాట చవిచూసిందన్నారు. ప్రస్తుతం ఆర్‌బిఐ ఆంక్షలు తొలగించడంతో ఇకపై యధావిధిగా గృహాలు, బంగారు, తాకట్టు రుణాలను యధావిధిగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. షేర్ హోల్డర్లకు మార్చి 2025 తర్వాత డివిడెంట్ అందిస్తామన్నారు. బ్యాంకు పరిధిలో గతంలో పేరుకుపోయిన సుమారు 3కోట్ల మేర బకాయిలు వసూలు చేయడం జరిగిందన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఐటి కేసుల్లో కూడా బ్యాంకుకు అనుకూలంగా తీర్పులు రావడం జరిగిందన్నారు. మరలా టౌన్‌బ్యాంక్‌ను లాభాల బాటలో నడిపించేందుకు ప్రజలు, ఖాతాదారులు సహకరించాలని కోరారు

## ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ



**పుంగనూరు రూరల్, మార్చి 1, ప్రభాతవార్త** పట్టణంలో ఇంటర్ పరీక్షలు నిర్వహించే కేంద్రాలను సిఐ శ్రీనివాసులు శని వారం తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు. జిరాక్స్ సెంటర్లను మూసి వేయించినట్లు పేర్కొన్నారు. వంద మీటర్ల లోపు ఇతరులు ఎవరూ ఉండరాదని ఆయన హెచ్చరించారు.

## 6 నుంచి కల్యాణ వెంకన్నకు బ్రహ్మోత్సవాలు



**పుంగనూరు, మార్చి 1, ప్రభాతవార్త** శ్రీ కల్యాణ వెంకటరమణ స్వామి శ్రీవారి బ్రహ్మోత్సవాలు నెల 6 నుంచి ప్రారంభం కానున్నాయని టెంపుల్ ఇన్స్పెక్టర్ మునేంద్ర బాబు తెలిపారు. మేరకు శనివారం గోడ పత్రికల ఆవిష్కరణ నిర్వహించారు. ఏటా ఘనంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది కూడా మార్చి 6 తారీకు మొదలు కొని 15 వరకు టిటిడి ఆధ్వర్యంలో అత్యంత వైభవం పేతంగా నిర్వహిచానున్నట్లు ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్ మునింద్ర బాబు, ఆలయ అర్చకులు మీడియా సమావేశంలో శ్రీనివాసాచార్యులు తెలిపారు.

## గిరిజన పాఠశాలకు వసతులు కల్పించండి



**పుంగనూరు రూరల్, మార్చ్ 1, ప్రభాతవార్త** పట్టణంలోని గిరిజన విద్యార్థుల పాఠశాలలో తక్షణమే సదుపాయాలు కల్పించాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన గిరిజన నాయకులు నాగే నాయక్ తదితరులతో గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. 113 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 4 బాత్రూములు, టాయిలెట్స్ మాత్రమే ఉన్నది, పదో తరగతి పరీక్షలకు 21 మంది వ్రాయడానికి ఇద్దరు ఉపాధ్యాయులతోనే పాఠాలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులని నియమించడం, సౌకర్యాలు కల్పించాలని కోరడం జరుగుతుంది, ముఖ్యంగా పాఠశాల స్థలం కొరకు 5 ఎకరాలు, ఆటస్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన, దళిత నాయకులు డాక్టర్ బాణావతి మునీంద్ర నాయక్, నాకే నాయక్, రామయ్య నాయక్, శ్రీరాములు నాయక్, చిన్న రాయుడు, జి టి నారాయణ, రామచంద్ర, ప్రిన్సిపాల్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపును అందుబాటులో ఏర్పాటు చేయాలి

– గువ్వల కాలనీ గ్రామస్తులు, టిడిపి నాయకులు మురళీ తహశీల్దార్‌కు వినతి



**పూతలపట్టు, మార్చి 1, ప్రభాతవార్త** మండల పరిధిలో ఉన్న రంగంపేట క్రాస్ ఎస్టీ గువ్వల కాలనీ గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ సీనియర్ గుంటూరు మురళి కలిసి తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మురళి వివరిస్తూ రంగంపేట క్రాస్ గువ్వల కాలనీలో 40 కుటుంబాలు నివసిస్తున్నారు. 40 మందికి రేషన్ బియ్యం కార్డు ఉన్నాయి. కొన్ని సంవత్సరాలు పూతలపట్టు రేషన్ షాపు ద్వారా నిత్యవసర వస్తువులు తీసుకొని వాళ్ల గత వైసిపి ప్రభుత్వం వచ్చాక సామనత్తం రేషన్ షాపుకు మార్చి వ్యాన్ ద్వారా నిత్యవసర వస్తువులు ఇస్తున్నారు. గువ్వల కాలనీ నుండి సామనత్తం డీలర్ షాపుకు పోవడానికి సుమారు నాలుగు కిలోమీటర్లు దూరం ఉంది మాకు చాలా ఇబ్బందికరంగా ఉంది. మాకు పూతలపట్టు రేషన్ షాప్ నందు నిత్యవసర వస్తువుల తీసుకో పోవడానికి దగ్గరగా ఉంటుంది. ఆర్థిక సోమత కూడా లేదు మాకు పూతలపట్టు రేషన్ షాప్ మార్చి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారుతాసిల్దార్‌గురప్పమురళితో మాట్లాడుతూ నెక్స్ నెల పూతలపట్టు రేషన్ షాప్‌కి మారుస్తా అన్నారు.

## నేషనల్ హైవే పక్కన వాటర్ పైపు లైన్లు - పట్టించుకోని అధికారులు



**పూతలపట్టు, మార్చి 1, ప్రభాతవార్త** చిత్తూరు నుండి పీలేరుకు వెళ్లే నేషనల్ హైవే పాటూరు గ్రామంలో యుండు బాలాజీ నేషనల్ హైవే పక్కన 200 మీటర్లు వాటర్ పైపు లైన్‌లను వేస్తుండగా చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు ఆర్ అండ్ బి అధికారులు తెలియపరిచిన అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో వర్షం ఆగి అక్కడ గుంతలుగా మారి పీలేరు నుండి చిత్తూరుకి బస్సులు లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అధికసంఖ్యలోవాహనదారులుపక్కకుతొలగాలంటేఇబ్బందులుగురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

## క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం



**చౌడేపల్లి, మార్చి 1 ప్రభాతవార్త** క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయమందించారు. మండలంలోని పంచాయతీ కేంద్రం లద్దిగంకు చెందిన బాబాజాన్ ఆటో నడుపు కొంటూ కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. అయితే గత కొన్నాళ్ళుగా అతను క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. గుర్తించిన బాబాసాహెబ్ అంబేద్కర్ సేవా సంఘం వారు బాబాజాన్‌కు వైద్య ఖర్చులకు గాను రూ. 5వేల ఆర్థికసాయమందించారు. ఆర్థికంగా చితికిపోయిన క్యాన్సర్ బాధిత బాబాజాన్ కుటుంబాన్ని అతన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంఘ నాయకులు మునస్వామి, మనోజ్, మునిలక్ష్మమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

## కుప్పం సబ్ డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు - డిఎస్పీ



**కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త** జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కుప్పం పోలీస్ సబ్ డివిజన్‌లో ఈనెల 31వతేది వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డిఎస్పీ పార్థసారథి తెలిపారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు ముందస్తు అనుమతులు లేకుండా నిర్వహించరాదన్నారు. కుప్పం అర్బన్, గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 30పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు : మున్సిపల్ కమీషనర్

**కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త** కుప్పం పురపాలిక సంఘం పరిధిలో ఉన్న మసీదుల వద్ద రమజాన్ మాసం సందర్భంగా ఆదివారం నుంచి ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఎక్కడా నీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. మసీదుల వద్ద పారిశుద్ధ్యం, నీటి సమస్య ఉంటే నేరుగా తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు.

## క్రీడలతో మానసికోల్లాసం సాధ్యం - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



**శాంతిపురం, మార్చి 1 ప్రభాతవార్త** యువతకు క్రీడలతో మానసికోల్లాసం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం గుండిశెట్టిపల్లిలో షార్ట్‌పిచ్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు చంద్ర, బాలు, రవి, మంజునాథరెడ్డి, ఉమాపతి, వేదశ్రీ, సరిత, డి.చలపతి, కన్నన్, మునేగౌడు, మురుగన్ పాల్గొన్నారు.

ఫోటో రైటప్ :

## ఘనంగా గురుమూర్తి ఎల్లమాంబ జాతర



**శాంతిపురం, మార్చి 1 ప్రభాతవార్త** మండలంలోని సోగడబల్లలో వెలసిన శ్రీ గుర్తుమూర్తి ఎల్లమాంబ జాతర శనివారం ఘనంగా మొదలైంది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేకాలంకరణ, అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానం, హరికథ, పచ్చిగెరిగ, అగ్నిగుండం, బాణ వేడుకలు, రాత్రి వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం వెండి రథం పల్లకిలో అమ్మవారి ఊరేగింపు, పొంగళ్ల సమర్పణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగమ్మ చెంగప్ప, తేజ్‌కుమార్, అర్చకులు కాశీనాథ్ శాస్త్రి, శ్యామ్ శాస్త్రి పాల్గొన్నారు.

## బాలుర ఉన్నతపాఠశాలకు డ్రమ్స్ వితరణ

**.తొట్టంబేడు, మార్చి 1 ప్రభాతవార్త**

యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర ఉన్నత పాఠశాలలో సంస్థ కోశాధికారి నారాయణ మాట్లాడుతూ యంగ్ ఎంప్లాయిస్ సంస్థ సోషల్ సర్వీస్ శ్రీకాళహస్తి మరియు పరిసర మండలాల్లో విద్యావైద్యం మరియు ఇతర మౌళిక వసతులు కల్పనలో ఎస్ సంస్థ ముందజలో ముందజంలో ఉందని దీనిలో భాగంగా పాఠశాల ఎన్‌సిసి ఉపాధ్యాయురాలు మాస్టర్ వెంకటముని, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చడమే లక్ష్యం

– తడి,పొడి చెత్తలతో సేంద్రీయ ఎరువు తయారీ – ఇవోపిఆర్డీ

**తిరుపతిరూరల్, మార్చి01 ప్రభాతవార్త:** తడి,పొడి చెత్తలను వేర్వేరుగా అందించి, సేంద్రీయ ఎరువు తయారీకి సహకరించాలని తిరుపతిరూరల్ ఇవోపిఆర్డీ వెంకటరత్నం తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలను పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలనే ముఖ్య ఉద్దేశంతో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం చెర్లోపల్లిలో తడి,పొడి చెత్తల నిర్వాహణపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిద్దిడమే ముఖ్యఉద్దేశం అన్నారు. తడి,పొడి చెత్తల ద్వారా తయారు చేసిన సేంద్రీయ ఎరువులను వ్యవసాయంలో వినియోగించవచ్చునని తెలిపారు.

## సిఎం నారా చంద్రబాబుకు ఘన స్వాగతం, విడ్కోలు



**గంగాధరనెల్లూరు, మార్చి 1 ప్రభాతవార్త:**

గంగాధరనెల్లూరు దళితవాడలో శనివారం సామాజిక పెన్షన్లు పంపిణీ చేయడానికి రామానాయుడుపల్లి హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అలాగే ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, అనంతపురం రేంజ్ డిఐజి షిమోసి బాజ్‌బాయ్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలులు సిఎంకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం చెప్పారు. పెన్షన్లు పంపిణీ చేసిన అనంతరం సిఎం చంద్రబాబుకు జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావులు రామానాయుడుపల్లి వద్ద ఏర్పాటు చేసి హెలిప్యాడ్‌లో ఘనంగా విడ్కోలు పలికారు. అలాగే ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే విఎం థామస్, ఎమ్మెల్యేలు డాక్టర్ కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్‌నాయుడు, పులివర్తినాని, గాలి భనుప్రకాష్, పులివర్తినాని, అమరనాధరెడ్డిలు సిఎంకు ఘనంగా విడ్కోలు పలికారు. అలాగే అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి బాజ్‌పేయ్, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడ పిడి వికాస్ మర్మత్, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతలు సిఎం నారా చంద్రబాబునాయుడుకు విడ్కోలు పలికారు.

## కేవీబీ పురం 99 శాతం పింఛన్ల పంపిణీ

**కేవీబీ పురం, మార్చి 1 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి 7 గంటల నుంచి పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి 99 శాతం పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీవో రాధారాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 6524 మందికి శనివారం పింఛన్లు పంపిణీచేసినట్లు ఆమె తెలిపారు. కొత్త పింఛన్లకు సంబంధించి తొలగింపులు, చేర్పులు, మార్పులు గురించి యాప్ వదలగానే సచివాలయ పరిధిలో అందరికి తెలియజేస్తామని సంబంధిత సచివాలయ పరిధిలో అందరూ కూడా దరఖాస్తులు పెట్టుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

## యుజిసి జాయింట్ సెక్రెటరీ సన్మానించిన ఎడ్యుకేషన్ సెక్రెటరీ



**తిరుపతి విద్య మార్చి 1 ప్రభాత వార్త** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్.అమోల్ ఎం.అంధారే మర్యాదపూర్వకంగా కలిసిన ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధ్యాపకుడు డాక్టర్.ఎన్.బాలసుబ్రమణ్యం. స్థానిక ఎస్వీ యూనివర్సిటీలో జరుగుతున్న ఇండియన్ నాలెడ్జ్ సిస్టం అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేపథ్యంలో ఎస్వియూ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి సన్మానించారు.

## రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

**తిరుపతి విద్య మార్చి 1 ప్రభాత వార్త** రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావు స్థానిక అన్నమయ్య సర్కిల్ లోని గ్రేడ్ – 1 గ్రంధాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంధాలయంలో చదువుకుంటున్న పాఠకులని అడిగి గ్రంధాలయంలోని సిబ్బంది సేవలను,మౌళిక వసతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భముగా పాఠకులని పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావుని చదువుకునేందుకు ప్రత్యేక స్టడీ హాల్,ఉచితముగా ఇంటర్నెట్ వైఫై ఏర్పాటు చేయాలని,పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త పుస్తకాలు అందుబాటులో వుంచాలని కోరారు.దీనికి వారు త్వరలో తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రంధలయ నిర్వహణ మరియు సిబ్బంది సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది జె.శివ ప్రసాద్, శ్రీమతి పి.జయమ్మ,పి. గోవిందరాజులు పాఠకులు పాల్గొన్నారు.

## ఘంటసాల విగ్రహానికి ప్రత్యేక పూజలు



**తిరుపతి(రవాణా),జనవరి 1 ప్రభాతవార్త:** నెలమొదటిన తిరుపతిలోని ఘంటసాల విగ్రహానికి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేసి,విశేష పుష్పాంజలి ఘటించారు. అమరగాయకుడు,తెలుగువారి మదిలో చిరస్థాయిగా నిలిచిన ఘంటసాల ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కొనియాడారు. తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని అన్నారు. భవానీనగర్‌కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెవన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పాపద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య, ఆదిస్వామి తదితరులు పుష్పాంజలి ఘటించారు.

## దళిత మహిళ అంటే ఎమ్మెల్యే ఆరణికి, కమిషనర్ మౌర్యకు అంత అలుసా...?

**తిరుపతి హెల్త్, మార్చి 1 ప్రభాతవార్త :** దళిత మహిళ అంటే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యకు అంతా అలుసా అని అఖిల భారత అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి హెచ్చరించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుణ్యమూర్తి మాట్లాడారు. తిరుపతి మున్సిపల్ జనన, మరణ రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్న కల్లూరు లక్ష్మీదేవికి హెల్త్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాల్సి ఉందన్నారు.చట్టం ప్రకారం గత మూడు సంవత్సరాలకు ముందే ఆమెకు హెల్త్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ రావాల్సి ఉంటే దానికి సంబంధించిన ఫైల్‌ను గత మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు జాతీయ ఎస్సీ కమిషన్ న్యూఢిల్లీ, లోకాయుక్త ఆదేశాల మేరకు ఇవ్వడానికి ముందుకు రావడం జరిగిందని తెలిపారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పదోన్నతి పక్రియ ఆగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత కమిషనర్, కొత్త కమిషనర్ మౌర్యకు బాధితురాలు కల్లూరు లక్ష్మీదేవి పదోన్నతి విషయాన్ని గురించి వివరించడం జరిగిందన్నారు. అయితే తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు లక్ష్మి దేవి పదోన్నతిని అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కాకి వెంకటేష్, కమిటి ప్రతినిధులు రెడ్డెప్ప, మధు, మంజునాథ్, శ్రీవల్లీ, నలిని, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని భవన నిర్మాణాలను ఉపేక్షించొద్దు

తిరుపతి కార్పొరేషన్, మార్చి 1, ప్రభాతవార్త



నగరంలో అనుమతులు లేని భవనాల నిర్మాణాలు జరగకుండా చూడాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని 19 వ వార్డు కార్పొరేటర్ ఆరణి సంధ్య, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి న్యూ బాలాజి కాలని, టిటిడి ప్లాట్స్, ఎస్.కే.డి. నగర్, వైకుంఠపురం పార్కు, రాస్ బిల్డింగ్, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, భవన నిర్మాణాల అనుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నాయనే పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయం కార్యదర్శులు నిత్యం ఆయా వార్డుల్లో పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఏవైనా కొత్తగా నిర్మాణాలు జరుగుతుంటే అనుమతులు పరిశీలించాలని అన్నారు. భవన నిర్మాణాల్లో ప్లాన్ లోని నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువల్లో చెత్త తొలగించాలని, మరమ్మత్తులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, డి.ఈ.లు మహేష్, లలిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి ఉపవాసదీక్షలు ప్రారంభం

శ్రీకాళహస్తి,మార్చి 1 ప్రభాతవార్త



ప్రపంచదేశాల్లో ముస్లింలు పవిత్రంగా ఆచరించే రంజాన్ మాసం తరావీహ్ నమాజులను శనివారం రాత్రి నుంచి ప్రారంభించారు. శ్రీకాళహస్తిలోని 14 మసీదుల్లో హాఫీజే ఖుర్ ఆన్‌లు తరావీహ్‌నమాజులో దివ్యఖుర్ ఆన్ పఠనం ప్రారంభించారు.ఇక ఆదివారం నుంచి ఉపవాసదీక్షలు ప్రారంభించారు. ఉపవాసదీక్షలు పాటించే వారిని చైతన్యవంతుల్ని చేస్తూ మత పెద్దలు,గురువులు బోధనలు చేస్తున్నారు. ముఖ్యంగా ఉపవాసదీక్ష పాటించే వారు ఆచరించాల్సిన విధి విధానాలను క్రమశిక్షణను చైతన్యవంతుల్ని చేస్తున్నారు.ముఖ్యంగా ఉపవాసదీక్ష పాటించే వారు 13 అంశాలకు దూరంగా ఉంటూ ఆచరించాలని సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఓ వక్త ఇలా తెలిపారు.నిద్రలో గడపరాదని ఆరాధనవైపు దృష్టి సారించాలని,షాపింగ్‌కు స్వస్తి చెప్పి దైవధ్యానానికి ప్రాధాన్యత ఇవ్వాలని,వ్యాపారాల కన్నా ఆరాధనకు అధిక సమయం కేటాయించాలని,రాత్రి తరావీహ్ తరువాత జల్సాలకు స్వస్తి చెప్పి నిద్రించి వేకువ జాము సహరికి అవకాశం కల్పించాలని,మత్తుపదార్థాలకు గుడ్‌బై చెప్పాలని,మసీదుల్లో ప్రాపంచిక మాటలకు స్వస్తి చెప్పాలన్నారు. పాదరక్షలు వదలటం,పార్కింగ్‌లకు క్రమశిక్షణతో ప్రాధాన్యత ఇవ్వాలని ,మసీదుల్లో నమాజుల సమయంలో బయట యువత అరుపులు గొడవలకు స్వస్తి చెప్పాలని తరావీహ్‌నమాజులు 8 కాని 20 రకాతులు ఎవరికి ఎంత అనుకూలమైతే అంత చదువుకోవచ్చునంటున్నారు.సాధ్యమైనంత వరకు తరావీహ్‌నమాజులకు 7 సంవత్సరాల పిల్లలను తీసుకురాకూడదన్నారు.ఉపవాస విషయాల్లో పరనింద కూడదన్నారు.మహిళల బాధ్యతలను తగ్గించాలన్నారు.

## ఇంటర్‌మీడియట్ పరీక్షా కేంద్రాల తనిఖీ

.తొట్టంబేడు, మార్చి 1 ప్రభాతవార్త




ఇంటర్‌మీడియల్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన దృష్ట్యా శనివారం పరీక్షా కేంద్రాలను డిఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఈసందర్భంగా పట్టణంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో విక్రం జూనియర్ కళాశాల, ఎంజిఎం కళాశాల, ఎస్వీఏ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, అమరావతి కళాశాల, కాసాగార్డెన్‌లో ఉన్న గురుకుల పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటుచేశారు. అన్ని కేంద్రాల్లో సుమారు 2వేల మంది పరీక్షలకు హజరయ్యారు. తొలిరోజు కావడంతో ఉదయం 8గంటలకే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో హజరై వారి హాల్‌టిక్కెట్లు నంబర్లు, గదులను పర్యవేక్షించుకున్నారు. పరీక్ష ఉదయం 9 నుంచి మద్యాహ్నం 12గంటల వరకు ముగిసింది. కాగా పరీక్షా కేంద్రాలను డిఎస్పీ నరసింహమూర్తి టుటౌన్ సిఐ వెంకటేశులు, పోలీసు సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద తనిఖీలను నిర్వహించి పరీక్షల సమయంలో ఎవ్వరిని అనుమతించవద్దని అక్కడ ఉన్న ఇన్విజిలేటర్లకు సూచించారు.

## ఫించన్లు పంపిణీచేసిన ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

.శ్రీకాళహస్తిరూరల్, మార్చి 1 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని అంజిమేడు గ్రామం నందు సామాజిక ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఏ శ్రీకాళహస్తి ఎంఎల్ఏ శాసనసభ్యులు బొజ్జలసుధీర్‌రెడ్డి ఫించన్లు పంపిణీచేశారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు శాసనసభ్యులు బొజ్జలసుధీర్‌రెడ్డి ఏర్పేడు మండలంలో అంజిమేడు గ్రామంలో సామాజిక ఫించన్లును పంపిణీచేశారు. ఈసందర్భంగ ఎంఎల్ఏ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వలె పెంచుతూ వచ్చిన ఫించన్లు కాకుండా ఏకంగా చంద్రబాబునాయుడు హాయాంలో ఏకంగా ఒకేసారి రూ.4వేలు ఫించన్లు నగదు పంపిణీచేయడం గమనించదగ్గ విషయం అన్నారు. ఇంకా ఎవ్వరికైనా ఫించన్లు రాకపోతే తనదృష్టికి తీసుకురావాలని ఎంఎల్ఏ కోరారు.కార్యక్రమంలో ఎంఎల్ఏతో పాటు నాయకులు ధనంజయులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించిన మాజీ మంత్రి రోజా



**విజయపురం, మార్చి 1 ప్రభాతవార్త:** మండలంలోని మాధవరంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశ్రాంతి తీసుకుంటున్న బాబు కుమారుడు స్టైన్‌ను శని వారం మాజీ మంత్రి రోజా పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, రాష్ట్ర వైసీపీ రైతు విభాగం కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, శ్యాంలాల్, శేఖర్‌రాజు, శ్రీరాములురెడ్డి, బిల్లుదాసు, అరుణాచలం పాల్గొన్నారు.

## సైన్స్ పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలి



**తిరుపతి విద్య మార్చి 1 ప్రభాత వార్త** మారుతున్న సామాజిక అవసరాలకు సైన్స్ పరిశోధనలు ఉపయోగపడాలని ఎస్వీయూ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి పేర్కొన్నారు.ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సైన్స్ రంగంలో జరిగిన పరిశోధనలు ప్రపంచంలోనే మన దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసే విధంగా ఉన్నాయని తెలిపారు.సైన్స్ పరిశోధనలు మానవ ఆహారానికీ, ఆరోగ్యానికీ,జీవన సౌలభ్యానికీ దోహదం చేస్తున్నాయని చెప్పారు. అయితే మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సైన్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలు జరగాలని ఆకాంక్షించారు. ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు మాట్లాడుతూ సైన్స్ లో ఫిజిక్స్ కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. భౌతికశాస్త్ర రంగంలో ఎన్నో విలువైన పరిశోధనలు సాగాయని అన్నారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగంలోనూ ఎన్నో గొప్ప పరిశోధనలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్లు హుస్సేన్,విజయభాస్కరరావు,అపర్ణ,రాజగోపాల్ రెడ్డి, విజయలక్ష్మి,వెంకటరమణరెడ్డి, హేమలత,పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 27వరోజుకు చేరిన వెటర్నరీ జూడాల నిరసన

తిరుపతి విద్య మార్చి 1 ప్రభాత వార్త



గౌరవవేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో జూడాలు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 27వరోజుకు చేరింది.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు.రూ.7వేల స్టైఫండ్తో నెలవారి ఖర్చులు ఎలా గడపాలో ప్రభుత్వం ఆలో చించాలని కోరారు. శాంతియుతంగా న్యామపోరాటం చేస్తున్న తమకు విద్యార్థి సంఘాలు మద్దత్తు తెల పడం అభినందనీయమన్నారు. ఇప్పటికే పలు మార్లు ప్రభుత్వానికి,వర్సిటీ అధికారులకు విన్నవించినా పట్టించు కోకపోవడం.గౌరవవేతనం పెంచే వరకు తాము సమ్మెను విరమించేదిలేదని హెచ్చరించారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పాకాల, మార్చి 1, ప్రభాతవార్త



పాకాల స్థానిక అమ్మ ఆటో స్టాండ్ డ్రైవర్ల సర్వసభ్య సమావేశం పాకాల వేదికగా సంఘ అధ్యక్షులు రహీం అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్ శివ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్ డి ఏ కూటమి పెద్దలు రవాణా రంగంలో నిత్యం ఎదురవుతున్న అనేక సమస్యలపై పలు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలుపొంది 8 నెలలు అవుతున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు అని ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈనెల 4వ తేదీన ఆటో కార్మికులు అన్ని జిల్లా మండల కేంద్రాల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ఆటో యూనియన్ పిలుపునిచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిన్ని, నాయకులు వాసు, అమిదుల్ల ఖాన్, ముషీర్, మంచూర్ అలీ, పురుషోత్తం, ఖాదర్, శీను తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా పెన్షన్ల పంపిణీ: ఎంఎల్ఏ పులివర్తి



**చంద్రగిరి, మార్చి 1 ప్రభాతవార్త:** అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించడం జరుగుతుందని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని కందులవారిపల్లి, ఏ.రంగంపేట, మల్లయ్యపల్లి గ్రామాలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి ఆయన కొంత మంది లబ్దిదారుల ఇళ్ళ వద్దకు వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన వారికి పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ డి.సుశీలాదేవి, టిడిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన వుండాలి..!

**రామచంద్రాపురం, మార్చి 1 ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగివుండాలని తహశీల్దార్ వెంకటరమణ అన్నారు. శనివారం పిళ్ళారికోన ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను వివరించారు. ఈ నేపథ్యంలోనే గ్రామస్థులు తమకు మంచినీటి బోరు వేయాలనీ, అదేవిధంగా ట్యాంకును నిర్మించి, నీటి కొరతను నివారించాలని కోరారు. గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీనారాయణ, విఆర్ఓ బాబు, పిసి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం..!

**చంద్రగిరి, మార్చి 1 ప్రభాతవార్త:** ప్రశాంత వాతావరణంలో శనివారం నుండి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, పాఠశాల ఏ బ్లాక్ 440 మందిని కేటాయించగా, 420 మంది హాజరు కాగా 20 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. అదేవిధంగా బి బ్లాక్‌లో 418 మంది విద్యార్థులకు 412 మంది హాజరు కాగా 6 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల, శ్రీపద్మావతీ బాలికల జడ్పీ హైస్కూల్ 416 మందికి గానూ 411 మంది హాజరు కాగా 5 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా బి బ్లాక్‌లో 416 మంది విద్యార్థులకు 414 మంది హాజరు కాగా 2 మంది గైర్హాజరయ్యారు. నారాయణ జూనియర్ కళాశాలలో 479 మందికి గానూ 466 మంది హాజరు కాగా 13 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

## అపోలో హాస్పిటల్లో 'బ్రెయిన్ స్ట్రోక్'కు అత్యాధునిక వైద్యసేవలు

–న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం




**తిరుపతిరూరల్, మార్చి 1 ప్రభాతవార్త:** చెన్నై అపోలో హాస్పిటల్లో బ్రెయిన్‌స్ట్రోక్ అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నట్లు చెన్నై అపోలో హాస్పిటల్ ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం తెలిపారు. శనివారం తిరుపతి అపోలో క్లినిక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నై గ్రీమ్స్ రోడ్డులో ఉన్న అపోలో హాస్పిటల్లో తక్కువ ఖర్చుతో నూతన టెక్నాలజీతో ప్రమాదకరమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు వైద్యంతో పాటు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. గుండె పాడైనప్పుడు గుండెకు ఎలా యాంజియో చేస్తామో, అదేవిధంగా బ్రెయిన్ డెడ్ అయి, మెదడులో రక్తం క్లాటైనప్పుడు బ్రెయిన్‌కు యాంజియో చేసి క్లాత్ తొలగించవచ్చునని తెలిపారు. ప్రమాదం జరిగిన 2నుంచి 24 గంటలలోపు రోగి అపోలో ఆసుపత్రికి రాగలిగితే ఆధునాతన శస్త్ర చికిత్స ద్వారా 80శాతం బ్రెయిన్‌స్ట్రోను అరికట్టవచ్చునని తెలియజేసారు. న్యూరో ఫిజిషియన్ డాక్టర్ కార్తికేయన్ న్యూరోసర్జరీ అనేది అనేక రకాల రుగ్మతల శస్త్ర చికిత్స నిర్వహణతో కూడిన శస్త్రచికిత్స ప్రత్యేకతని తెలిపారు. ఎన్నో రకాలైన సాధారణ రుగ్మతలు మెదడు వెన్నెముక కణితి, అనూరిజం, ఏవీఎం మెదడు, వెన్నెముక వాస్క్యులర్ వైకల్యం, తల, మెడ, వెన్నెముకకు గాయం, మెదడు ద్రవ సేకరణలు, మెదడు ద్రవంలీక్ మెదడులో చుట్టూ రక్తం సేకరణ, వెన్నెముక క్షీణత రుగ్మతలు, న్యూరోసర్జికల్ చికిత్స యొక్క కొత్త డొమైన్లలో పార్కిన్సోని తదితర ఆధునాతన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

## గృహ విద్యుత్ అదనపులోడు క్రమబద్ధీకరణకు రాయితీ

–ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు



**తిరుపతిరూరల్, మార్చి 1 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణి సంస్థ (ఎస్పిడిసిఎల్) పరిధిలో గృహ విద్యుత్ అదనపులోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీ కల్పిస్తున్నామని ఎపిఎస్పీడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్సీ) ఆదేశాలకు అను గుణంగా వినియోగదారులు తాము వినియోగిస్తున్న అదనపు విద్యుత్‌లోడు క్రమబద్ధీకరణకు ఈ యేడాది మార్చి 1వతేదీ నుంచి జూన్ 30వ తేదీలోగ స్వచ్ఛందంగా ధరఖాస్తు చేసుకున్నట్లయితే, ఆ అదనపులోడు క్రమబద్ధీకరణకు వినియోగదారులు చెల్లించాల్సి మొత్తంలో 50శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. సౌకర్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## భారతీయ జ్ఞాన పరంపర ఆధునిక సమాజ పురోగతికి అత్యావశ్యం

**తిరుపతి విద్య మార్చి 1 ప్రభాత వార్త** ఎస్వియు మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ( ఎమ్ ఎమ్ టి టి సి) నందు యుజిసి సహకారంతో భారతీయ జ్ఞాన పరంపర అంశంపై వారం రోజులు పాటు శిక్షణ కార్యక్రమ ముగింపు సభ విభాగ డైరెక్టర్ ఆచార్య ఆర్ పి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమా,సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిస్తూ మన ప్రాచీన అంశాలైన ఆయుర్వేద,నీటి సంరక్షణ,పంటల సాగు, గురుకుల విద్య, సాంకేతిక స్థితి, ప్రాచీన విజ్ఞానం మొదలగున్నవి ఆధునిక సమాజానికి అనుసంధానించి అభివృద్ధి బాటలో తీసుకెళ్లేందుకు అధ్యాపకులకు ఈ శిక్షణ కార్యక్రమం చాలా ముఖ్యమైనది అన్నారు. మరో అతిథి యుజిసి జాయింట్ సెక్రటరీ డా. అనోల్ ఆండ్రే ప్రసంగిస్తూ ప్రాచీన భారత జ్ఞాన పరంపర పరిరక్షణ ఆధునిక సమాజంలో అనుసంధానించుటకు కేంద్ర ప్రభుత్వం యుజిసి ద్వారా ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా లక్ష మంది అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన అన్నారు.

# తిరుపతి డివిజన్

## ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

**పుత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను



నెరవేరుస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. శనివారం మునిసిపాలిటీలోని గేట్‌పుత్తూరు ప్రాంతంలో ఆరో వార్డు గాంధి నగర్‌లో లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి ఆయన పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు నెరవేర్చే దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్టు తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీనే లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందిస్తున్నామన్నారు. రూ. 4000 వేలు పెన్షన్ తీసుకుంటున్న అవ్వ, తాత కళ్లల్లో ఆనందం కనపడుతోందని, దివ్యాంగుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా చూస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, నాయకులు డి.ఎస్.గణేష్, షణ్ముగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రామకృష్ణ పరమహంస 191 వ జన్మదిన వేడుకలు



**పాకాల, మర్చి 1, ప్రభాతవార్త** పాకాలలోని స్థానిక శ్రీ రామకృష్ణ సేవాసమితిలో అధ్యక్షులు ఎస్వీ రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. నేటి సమాజానికి రామకృష్ణుడు, శారదాదేవి, వివేకానంద స్వామి, ఆదర్శమని వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఎన్ పరంధాం నాయుడు, కె. సాత్యకి, సుధాకర్ రెడ్డి, దొరస్వామి నాయుడు, ధనుంజయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణి



**పాకాల, మార్చి 1, ప్రభాతవార్త** పాకాల మండలంలోని కావలి వారిపల్లి పంచాయతీ పరిధిలో భర్త చనిపోయి మరుసటి నెల రోజులకే భార్యకు పెన్షన్ ఇచ్చిన కూటమి ప్రభుత్వం బి గురు స్వామి నాయుడు చనిపోయిన తర్వాత సతీమణి భారతికి కొత్త పెన్షన్ ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా భారతమ్మ నారా చంద్రబాబు నాయుడు మరియు పులివర్తి నానికి ధన్యవాదాలు తెలిపారు. భర్తను తలుచుకొని మనోవేదనకు గురైంది. ఈ పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు క్రీష్ణమనేని సావిత్రి, బొల్లినేని మహేష్. బషీర్, రూపేష్. లక్ష్మిపతి, అంజిత్, జగదీష్. అనిల్, హైమా, రాము పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు..

**. రేణిగుంట మార్చి 1 ప్రభాతవార్త** రేణిగుంట మండలంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో నాలుగు సెంటర్లలో పరీక్షలు జరిగాయి. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాల, నారాయణ జూనియర్ కళాశాల, గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో కె. ఆర్.సి. జూనియర్ కళాశాలలో అధికారులు పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత తో నిర్వహించారు. 1451 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1433 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 18 మంది గైర్హాజరయ్యారు.రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ శరత్ చంద్ర, రూరల్ సీఐ మురళీకృష్ణ,అర్బన్ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, గాజుల మండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు కల్పించారు.రేణిగుంట మండల విద్యాధికారులు గంటా ఇందిరా దేవి, రంగనాథ్ తరచు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. రేణిగుంట మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఛత్ర ప్రకాష్ తమ సిబ్బంది ద్వారా పరీక్షా కేంద్రాల వద్ద పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఆరోగ్య భద్రత కల్పించారు.

## లైసెన్సులు రెన్యువల్ చేసుకోకపోతే చర్యలు తప్పవు

**రేణిగుంట మార్చి 1 ప్రభాతవార్త** కర్మాగారాలకు లైసెన్సులు రెన్యువల్ చేసుకోకపోతే చర్యలు కచ్చితంగా ఉంటాయని జిల్లా ప్రొహిబిషన్ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. రేణిగుంట మండలం గాజుల మండ్యం పారిశ్రామిక వాడలోని పలు కెమికల్ కర్మాగారాలను జిల్లా ప్రొహిబిషన్ఎక్సైజ్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పారిశ్రామిక వాడలోని ఏపీ డ్రగ్స్, రేడియంట్ ఫార్మా కెమికల్స్, క్రోమో మెటడ్కోర్ ఫార్మా, సైనెర్జి రెమిడీస్, మల్లాడి డ్రగ్స్‌ఫార్మాసిటికల్స్, గ్లోరీ ఫార్మా కెమికల్స్, ఇండియన్ పొటాష్, ఓ. ఆర్. డిస్టలరీ కంపెనీలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. మార్చి 31వ తేదీ లోపల లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని ఆదేశించారు. తనిఖీ చేసిన వారిలో ప్రొహిబిషన్ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసానాయుడు, ఎస్సైలు కవీశ్వర నాయుడు, అంజలి ప్రసన్న సిబ్బంది పాల్గొన్నారు.

## మా పాఠశాలను విలీనం చేస్తే ఒప్పుకోం ...




**రేణిగుంట మార్చి 1 ప్రభాత వార్త** రేణిగుంట మండలం విప్పమాను పట్టేడ మండల ప్రజా పరిషత్ పాఠశాలను పక్క ఊరి పాఠశాలలో విలీనం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని గ్రామపంచాయతీ కార్యాలయం నందు సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి సమక్షంలో జరిగిన ఎస్ఎంసి సమావేశంలో తీర్మానించారు. తమ ఊరి పాఠశాలను వేరే ఊరికి చెందిన పాఠశాలలో విలీనం చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలియడంతో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించామన్నారు. తమ పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యాబోధన చేయడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయని, జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి ఒకసారి పాఠశాల ను సందర్శించాలన్నారు. తమ ఊరి పాఠశాలను మోడల్ పాఠశాలగా అభివృద్ధి పరచడానికి అనుమతించాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. సమావేశంలో సర్పంచి పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీపతి రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయని మేరీ పద్మ కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వెనుకబడిన గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించడమే లక్ష్యం

**బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 1 ప్రభాతవార్త:**

అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాలను గుర్తించి అభివృద్ధి వైపు నడిపించడమే పౌర హక్కుల దినోత్సవం లక్ష్యమని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు సివిల్స్‌డే కార్యక్రమంలో తెలిపారు. శనివారం మూలబంధ యానాది సెంటర్‌లో ఎంపీపీ ఎలిమెంటరీ స్కూలులో పౌర హక్కుల దినోత్సవ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మండల తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. ప్రజలు గ్రామ సర్పంచ్ సుమారు 30 మంది పాల్గొన్నారు. మూలబంధ ఎస్టీ కాలనీకి సంబంధించిన మరమ్మతులకు గురైన తాగునీరు బోరు రిపేరు, ఎలిమెంటరీ స్కూలు ఆవరణకు ప్రహరీగోడ నిర్మించాలని, పెద్ద పాలివేట్ రోడ్డు నుంచి మూలబంధ సెంటర్ రోడ్డు వరకఉ వచ్చే మట్టి రోడ్డును 20 అడుగులు వెడల్పుతో సిమెంటు రోడ్డు ఏర్పాటు, ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు కాలనీ ఇళ్ల పక్కా గృహాలు, రేషన్‌కార్డులు లేని వారికి ఇవ్వాలని గ్రామస్తులు తహసీల్దార్, ఎంపీడీవోలకు విన్నవించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మించల నల్లయ్య, గ్రామ రెవెన్యూ అధికారి తిరుమలేష్, విలేజ్ సర్వేయర్ వంశీకృష్ణ, గ్రామసేవకుడు అనిల్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఈ - పంట సూపర్ చెక్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

రేణిగుంట, మార్చి 1 ప్రభాతవార్త



రేణిగుంట మండలం, గాజుల మండ్య గ్రామ పొలాల్లో ఈ క్రాప్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేసిన పంటలను సూపర్ చెక్ తనిఖీ చేసి రైతులతో మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు తాము చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారుల సహకారంతో పంట నమోదు (ఈ– క్రాప్) చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రేణిగుంట మండలం గాజుల మండ్యం గ్రామ పొలాల్లో ఈ క్రాప్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేసిన పంటలను సూపర్ చెక్ తనిఖీ చేశారు. ప్రతి ఒక్క రైతు తాము సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారులతో పంట నమోదు (ఈ క్రాప్) చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్ట జరిగితే రైతుకు పరిహారం అందించేందుకు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదులో రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. తమకు ఆర్ఎస్‌కె అధికారులు ఎప్పటికప్పుడు కలిసి సాగులో సూచనలు అందిస్తున్నారని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి పండించిన రైతు ధనంజయరెడ్డి పొలాన్ని సందర్శించి ఇదే విధంగా గ్రామంలోని మిగిలిన రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించి వినియోగించడం వలన ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని సూచించారు. వరి మద్దతు ధర అమలు అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, మండల వ్యవసాయ అధికారి సునీల్ కుమార్‌రెడ్డి,గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, మార్చి 1 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రతి నెలా ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యలను వీలైనంత వరకు పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈ వేదికను ఉపయోగించుకోవాలని ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల ద్వారా అందజేస్తే వాటిలో పరిష్కరించే అంశాలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. అనంతరం సంబంధిత అధికారులతో తనకు వచ్చిన వినతిపత్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మాధవనాయుడు, కామిరెడ్డి మురళీరెడ్డి, ఎన్.రాజులుచెంచమ్మ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం

కోట, మార్చి 1 ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం కోట మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, కోటలోని అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఈ పరీక్షలు జరిగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లాంగ్వేజ్ పేపర్-1 పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు పర్యవేక్షణలో ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

## ఎమ్మెల్యే చేతులు మీదుగా పెన్షన్లు పంపిణీ

సూళ్లూరుపేట, మార్చి 1 ప్రభాతవార్త

సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్ ఎస్టీ కాలనీలో శనివారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్లను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే సామాజిక భద్రత పెన్షన్లను అర్హులందరికీ అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మాధవనాయుడు, కొండవలరావు, రాజశేఖర్, రాజేంద్ర, చంద్రమోహన్, ఎజి కిషోర్, కె.శ్రీధర్, హనుమంతరావు, మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు

## అమరుల త్యాగాలు స్మరించుకోవాలి

కోట, మార్చి 1 ప్రభాతవార్త




ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధనలో అమరులైన వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మందా పెంచలయ్య, జిల్లా అధికార ప్రతినిధి గొల్లపల్లి సిసింద్రియ అన్నారు. శనివారం శ్యామసుందరపురంలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యమంలో ప్రాణాలు పోగొట్టుకున్న వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వెంకటయ్య, కృష్ణ మాదిగ, శ్రీనివాసులు, పవన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

కోట, మార్చి 1 ప్రభాతవార్త

ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం శ్యామసుందరపురంలో ఎంపిటిసి సభ్యులు షేక్ షంషుద్దీన్ పంపిణీ చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచనల మేరకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసినట్లు షంషుద్దీన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షుడు ఎన్.మోహన్, పట్టణ ప్రధాన కార్యదర్శి తల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తడ పల్లెల్లో ఇంటింటికి వెళ్లి స్వచ్ఛాంధ్ర

తడ, మార్చి 1 ప్రభాతవార్త



తడ మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు శనివారం ఇంటింటికి వెళ్లి స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి దగ్గర డోర్ టు డోర్ చెత్తను ఏరివేసి ఒక చోట చేర్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని, దీనివలన అనారోగ్య పరిస్థితి ఏర్పడుతుందని ఎంపిడిఓ నెల్లూరు విజయకుమార్ తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారు.

## తడలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

తడ, మార్చి 1 ప్రభాతవార్త

తడ మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. మండలంలోని 16 సచివాలయాల సిబ్బంది ఉదయం 7 గంటల నుంచే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 5,890 మంది లబ్ధిదారులకు గాను రెండు కోట్ల 51 లక్షల 4,500 రూపాయలు పంపిణీ జరుగుతుందని ఎంపిడిఓ విజయకుమార్ తెలిపారు. కాదలూరు నుంచి రామాపురం దాకా ప్రతి గ్రామంలోను ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## ప్రగతి సేవా సంస్థచే విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

గూడూరు, మార్చి 1, ప్రభాతవార్త



చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి పరీక్షలు రాయనున్న సందర్భంగా ఎగ్జామ్ ప్యాడ్, స్టేషనరీని ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యుడు ఏగ్గి రెడ్డి విజయ్ కుమార్ సహకారంతో అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలు బాగా రాసి అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు ప్రగతి సేవా సంస్థ ద్వారా వారిని సత్కరించి బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మములాజాన్, వీణా పాణి, కల్పన, రవి, నారాయణ, గిరి, నాని సునీల్ ప్రగతి సేవా సంస్థ ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు ప్రగతి కుటుంబ సభ్యులు పోతిరెడ్డి పెంచలయ్య, డిష్ నాగరాజు, సంచి ముని ప్రసాద్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ నేరవేర్చిన ఘనత చంద్రబాబు దే

### - తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణీ రెడ్డి

గూడూరు, మార్చి 1, ప్రభాతవార్త



ఇచ్చిన హామీ నేరవేర్చిన ఘనత చంద్ర బాబు కే సాధ్యమని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి పేర్కొన్నారు. శనివారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో పెన్షన్లను పంపిణీ చేశారు. శ్రావణి రెడ్డి మాట్లాడుతూ పెన్షన్లు పెంచిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక్కొక్కటిగా సూపర్ సి క్స్ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలను సీఎం చంద్రబాబు నాయుడు పొందుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఆరోగ్యం బాగా లేక బాధపడుతున్న లబ్ధిదారునికి రెండు నెలల పెన్షన్లు ఒకేసారి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు యరమాపు హేమ కుమార్ రెడ్డి, మాజీ చేనేత సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, అశోక్, కృష్ణమూర్తి, రాఘయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజనుల హక్కుల సాధనకై పోరాటం

### యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య

వెంకటగిరి, మార్చి 1, ప్రభాతవార్త

మోపూరు భూ సమస్యపై పోరాట ఉదృతం చేస్తామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంచలయ్య తెలిపారు. వెంకటగిరిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డక్కిలి మండలం మోపూరు భూ సమస్యపై యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జున అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీలు, గిరిజన, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పెంచలయ్య, రైతు కూలీ సంఘం తరపున వివి రమణయ్య, అంబేద్కర్ ఐక్యవేదిక ఉపాధ్యక్షులు భాస్కర్, వైసీపి కౌన్సిలర్ ఆరి శంకరయ్య, టిడిపి ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిట్టెపు వెంకటా చలపతి, సిపిఎంచెంగయ్య, బీఎస్పీ కోటయ్య, బిజెపి తరపున అంకయ్య, ప్రజా సంఘాల ఐక్య వేదిక నుంచి రఫీ, గూడూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు మోపూరు అడివయ్య హాజరయ్యారు, సందర్భంగా చర్చించి పలు తీర్మానాలు ఏకగ్రీవంగా చేయడమైనది. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, నాయకులు మానికల మురళీ, ఇండ్ల మల్లి, తిరివీధి సతీష్ చంద్ర, పొట్టేళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం

గూడూరు, మార్చి 1, ప్రభాతవార్త

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు నియోజకవర్గ స్థాయిలో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగిందని, పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన నాయకులను గుర్తించి సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు మొదలవుతాయని, ప్రతి నాయకుడు కార్యకర్త కేవైసీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని, మే నెలలో తల్లికి వందనం తదితర పథకాలు అమలు జరుగుతాయని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, తిరుపతి నియోజకవర్గ కార్యదర్శి పట్టాభి రెడ్డి, గూడూరు నియోజకవర్గం రైతు ప్రధాన కార్యదర్శి కొండా రామచంద్రారెడ్డి, టౌన్ రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు టీడీపీ మండలాధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వేంకటేశ్వరరాజు, ఉచ్చురు వెంకటేశ్వర్లు రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, మైనారిటీ నాయకులు రహీం, బిల్లు గుండాల లీలావతి మట్టం శ్రావణి చెంచురామయ్య, గూడూరు నియోజకవర్గ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేని సద్వినియోగం చేసుకోండి

చిల్లకూరు, మార్చి 1, ప్రభాతవార్త




మండలంలోని కడివేడు గ్రామంలో శనివారం చిలకూర తాసిల్దార్ కే శ్రీనివాసులు ఆధ్వర్యంలో కడివేడు కమ్మవారిపాలెం తిమ్మనగారిపాలెం గ్రామాల సంబంధించిన రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని కొన్ని వందల సంవత్సరాల క్రితం భూములు సర్వేలు చేయడం జరిగిందని ఇప్పుడు ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకొని రికార్డులు మార్చేసి పాసుబుక్కులు సృష్టించుకుని రెవెన్యూ రికార్డుని హస్త వెస్తం చేసి పెట్టి ఉన్నారని అందుకోసం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మేన ఆదేశాల మేరకు త్వరలో 50 మంది కమిటీ ఏర్పడి రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతు మీ పొలం వద్ద ఉండి కొలతలు అనంతరం రికార్డులు నమోదు చేయించుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణ విఆర్ఓ బాలాజీ సర్వే బృందం పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త గురించి ప్రజలకు అవగాహన ఉండాలి

గూడూరు, మార్చి 1, ప్రభాతవార్త

చెత్తను ఎక్కడపడితే అక్కడ విసిరి పారేయకుండా తడి, పొడి చెత్త వేరువేరుగా ఉంచి మీ మీ ఇంటి వద్దకు వచ్చే చెత్త బండ్లలో వాటిని అందించాలని మండల విస్తృణాధికారి ఎన్ మోహన్ అన్నారు. గూడూరు రూరల్ మండలంలోని పాలిచర్ల, మిటాత్మకూరు గ్రామంలలో శనివారం జరిగిన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెత్తని గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందిస్తే, ఆ చెత్తను తీసుకుని వెళ్లి చెత్త ద్వారా సంపద సృష్టించే కేంద్రాలకు తరలించి తద్వారా ఎరువులను తయారు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ మస్తానయ్య, ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## పాడి రైతులు పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి

వాకాడు, మార్చి 1, ప్రభాతవార్త

పాడి రైతులు పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలని పశువైద్యశాఖాధికారి రైతులకు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 1వ తేది నుండి 30వ తేది వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు పశువులకు వేయడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి టీకాలు 4 నెలల పైబడ్డ పశువులన్నింటికి చేయబడునని బ్రూసెల్లో వ్యాధి నిరోధక టీకాలు 4 - 8 నెలల వయస్సు వున్న ఆడ దూడలకు వేయడం జరుగుతుందన్నారు.

## చెత్త నుండి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం - డిఎల్‌పిఓ



బాలాయపల్లి, మార్చి 1, ప్రభాతవార్త

చెత్త నుండి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని డిఎల్పిఓ వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని గూడూరు డివిజన్ పంచాయతీ అధికారి వెంకటరమణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ జరుగుతుందని తెలిపారు. వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల వారికి ఎంపిక చేసి బాలాయపల్లిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా చిల్లకూరు, గూడూరు, వెందోడును ఎంపిక చేసి వెందోడులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కోట, వాకాడు, చిట్టమూరు ఎంపిక చేసి వాకాడులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, ప్రజలకు శిక్షణ ఇస్తామన్నారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైన బాలాయపల్లిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో వాకింగ్ ట్రాక్ వాతావరణం పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. డిఎల్పిఓ వెంట ఈఓపిఆర్డి మోహన రాజు, వెలుగు ఏపిఎం పోలమ్మ, పంచాయతీ కార్యదర్శి లీలావతి తదితరులు ఉన్నారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

వెంకటగిరి, మార్చి 1, ప్రభాతవార్త



వెంకటగిరి పట్టణం 5, 11 వార్డులలో ఎమ్మెల్యే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో పెన్షన్లు పంపిణీ నామామాత్రంగా చేశారని తెలిపారు. ఒకటో తేదీ సెలవు వస్తే ముందు రోజే పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని, పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సిఐ ఏవి రమణ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె వి కె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, నాయకులు చెంగారావు, ఆనంద్, మల్లారం బాబుతదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించండి

వెంకటగిరి, మార్చి 1, ప్రభాతవార్త

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 01.03.2025 నుండి 30.03.2025 వరకు ఉచిత గాలికుంటు వ్యాధి బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమము వెంకటగిరి ప్రాంతీయ పశువైద్యశాల పరిధి లోని వెంకటగిరి, డక్కిలి మండలాలలో వేస్తున్నట్లు పశు వైద్య శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం వి స్వామి బాబు తెలిపారు. పశుపోషకులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తమ పశువులకు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. వెంకటగిరి, డక్కిలి మండలాల్లోని మొత్తము పశువులకు టీకాలు ఈనెల 30వ తేదీ వరకు వేస్తారని చెప్పారు. ఈ టీకాలు వేయటానికి రెండు మండలాలలో ఐదు బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## ఈవ్ టీసింగ్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన

గూడూరు, మార్చి 1, ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మహిళా వారోత్సవాల్లో భాగంగా శనివారం డిఎస్‌పి గీతా కుమారి గూడూరు పట్టణంలోని తమ కార్యాలయంలో విద్యార్థినిలకు ఈవ్ టీసింగ్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి గీతాకుమారి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చక్కగా చదువుకోవాలని, ఏదైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు మా దృష్టికి తీసుకువస్తే సరైన పరిష్కారం చూపుతామని, తొందరపడి ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని, సైబర్ నేరాలు, సోషల్ మీడియాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజారక్షణలో ప్రతినిత్యం పోలీసు వ్యవస్థ ముందుంటుందని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని జడ్పీ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రీజనల్‌గా కంకణల పెంచల్ నాయుడు

. గూడూరు, మార్చి 1, ప్రభాతవార్త



ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమీషన్ సౌత్ ఇండియా రీజనల్‌గా ఎన్నికైన సందర్భంగా కంకణాల పెంచల నాయుడు ఎన్నికైనారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణం నా జన్మ స్థానం కనుక నేను పుట్టి పెరిగిన గూడూరులో ప్రజలకు సేవ చేయాలని శిరసు వంచి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.

## మినీ గురుకులంలో జాతీయ సైన్స్ దినోత్సవం

### - ముఖ్య అతిథిగా పాల్గొన్న మయూరి శ్యామ్ యాదవ్

గూడూరు, మార్చి 1, ప్రభాతవార్త

గూడూరు రెండవ పట్టణంలోని ఏపీటీడబ్ల్యూఆర్ మినీ గురుకులం నందు జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం నాడు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకృష్ణ సేవ సమితి అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామసుందరరావు(మయూరి శ్యామ్ యాదవ్) పాల్గొన్నారు. ఈసందర్భంగా సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థినులు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నమూనా, వేస్ట్ వాటర్ ను ప్యూరిఫైడ్ వాటర్ గా మార్చే నమూనా ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ మినీ గురుకులం నందు ప్రతినెలా క్రమంతప్పకుండా శ్రీకృష్ణ సేవసమితి ఆధ్వర్యంలో నిర్వహించే విద్యార్థునులు సామూహిక జన్మదిన కార్యక్రమంలో భాగంగా 8మంది విద్యార్థునులచే మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో బర్త్ డే కేక్ కట్ చేసి వారి జన్మదిన వేడుకలను కూడా ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గురుకులం హెడ్ మాస్టర్ మేరీ ప్రియత, ఉపాధ్యాయునులు, విద్యార్థునులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు అపూర్వ స్వాగతం.. వీడ్కోలు.



రేణిగుంట మార్చి 1 ప్రభాతవార్త

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం అపూర్వ స్వాగతం లభించింది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నందు ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ తదితర కార్యక్రమాల్లో పాల్గొనడానికి ప్రత్యేక విమానంలో గన్నవరం నుండి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి బొట్టు పెట్టి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. విమానాశ్రయంలో ఆయనకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇంచార్జి కోట వినుత, మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి నాయుడు, టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, రేణిగుంట తహసిల్దార్ సురేష్ బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖ టిడిపి నేతలు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి హెలికాప్టర్లో గంగాధర్ నెల్లూరు బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకొని అదే హెలికాప్టర్లో రేణిగుంట చేరుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎస్వీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అప్పారావు, స్వాగతం పలకటానికి వచ్చిన జిల్లా ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు వీడ్కోలు పలుకుతుండగా ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు

చంద్రగిరి, మార్చి 1 ప్రభాతవార్త:



శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్య కైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కళ్యాణ సుందర్, పాల్గొన్నారు.

## రుద్రాక్షల పల్లకిలో స్వామి అమ్మవార్లు దర్శనం

శ్రీకాళహస్తి-ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామిఅమ్మవార్లు రుద్రాక్షల పల్లకిలో భక్త జనులకు దర్శనమిచ్చారు. శుక్రవారం రాత్రి నుంచి పట్టణంలో ఎటు చూసిన భక్తులే స్వామి అమ్మవార్ల వివాహ వేడుకల్లో పరవశించారు. శనివారం వేకువ జామున జరిగిన వివాహానికి భారీ ఎత్తున కానుకలు సమర్పించారు. ఉదయం నూతన వధూవరులు భక్తుల నీరాజనాల్ని అందుకుంటూ హారతులందుకుంటూ ముందుకు సాగారు. బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారు వీదుల్లో భక్తుల నుంచి హారతులందుకుంటూ ఉదయం 9గంటలకు బిక్షాల గాలిగోపురం పక్కనే ఉన్న ఏనుగుల మండపం వద్దకు చేర్చారు. అక్కడ సంప్రదాయ డోలు, సన్నాయి కళాకారులు ఆదమరచి నాట్యాలు చేస్తూ ఆలయానికి చేర్చారు. ఆలయానికి చేరిన తరువాత అల ంకార మండపం నుంచి మళ్ళీ స్వామి అమ్మవార్లను గ్రామోత్సవానికి ఆలయం నుంచి బోయిలు మోసుకుంటూ పట్టణంలో ఊరేగింపు సాగించారు. స్వామి అమ్మవార్లు రుద్రాక్షల పల్లకిల్లో పయనిస్తుండగా 'రుద్రాక్షల కదలిక శివ శివా అన్నట్లు' వినబడింది. ఉత్సవాల్ని నాలుగుమాడావీధులతో పాటు బాబూఅగ్రహారం మీదుగా సాగించారు.

## సిఎం చంద్రబాబుకు శివయ్య తీర్థప్రసాదాలు

శ్రీకాళహస్తి, మార్చి 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్న నేపథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్‌ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలసి శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించి సత్కరించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లును శ్రీకాళహస్తి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీగా రూపొందించిన ప్రణాళికలు పట్ల ప్రజలు, భక్తులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు సిఎంకు ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి వివరించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయానని భవిష్యత్తులో తప్పక హాజరవుతానని సిఎం హామీ ఇచ్చినట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు. కాగా శ్రీకాళహస్తీశ్వరాలయ సేవకుల్లో రంగినేని చెంచయ్యనాయుడు సిఎంకు వినతిపత్రం అందించారు.

## అగస్త్యేశ్వరాలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

తొట్టంబేడు, మార్చి 1 ప్రభాతవార్త



మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో వెలసిన దుర్గాంబిక సమేత అగస్తీశ్వరాలయంలో శనివారం ధ్వజ అవరోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం అనంతరం అర్ధరాత్రి నంది వాహనంపై స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అశేష సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోగా, శనివారం ఉదయం ధ్వజ అవరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం ముందు ఉన్న ధ్వజస్తంభానికి ఉన్న చీరలను అవరోహణ చేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ముగించారు. హాజరైన పలువురు భక్తులు హర హర మహాదేవ..శంభోశంకర అంటూ భక్తినామస్మరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాద్‌శర్మ, మనోహర్‌శర్మ, రాజశేఖర్‌శర్మలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.